



హిందూపురంలో నిర్వహించిన సమ్మె నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు



మడకశిర మండలం బుల్లసముద్రం గ్రామంలో పంట పొలాలను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు



లేపాక్షి మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మె నిరసన కార్యక్రమంలో చంటి బిడ్డతో సహా పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్త

సమస్యల పరిష్కారంపై అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఉధృతం అవుతోంది. 2వ రోజు బుధవారం నాడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ అంగన్‌వాడీ టీచర్లు, మినీటీచర్లు, ఆయాలు నిరసన దీక్షల్లో పాల్గొన్నారు. చట్టిబిడ్డలను ఎత్తుకుని దీక్షల్లో పాల్గొన్నారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరాల్లోనే కూర్చొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే 'అంగన్‌వాడీ అక్కాచెల్లెమ్మల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి గారూ... మాఆవేదను పట్టించుకోండి'.. అంటూ వేడుకున్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. సిపిఎం నాయకులు అంగన్‌వాడీల దీక్షల్లో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. సిపిఎంతో పాటు టిడిపి, జనసేన పార్టీలు సైతం అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. పాదయాత్ర సందర్భంగా తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామనే హామీతో పాటు ఇతర సమస్యలపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించేంత వరకు సమ్మెను విరమించేది లేదంటూ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాల్సింది పోయి సమ్మె చేస్తున్న వారిపై అధికారులతో బెదిరింపులకు దిగుతోందని, ఇలాంటి వాటికి బెదిరేది లేదన్నారు.

నష్టంపై రైతుల ఏ'కరువు'..!

- అన్ని పంటలూ నష్టపోయాం.. ఆదుకోండి
- కేంద్ర బృందం ఎదుట రైతుల ఆవేదన
- 2వ రోజు శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటన
- ముగిసిన కేంద్ర కరువు బృందం పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఈ ఏడాది తీవ్రమైన కరువుతో పంటలను మొత్తం కోల్పోయాం. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. గడిచిన మూడేళ్లుగా పంటల కోసం చేసిన అప్పులనే తీర్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ ఏడాది పంటల అప్పులు పెరిగాయి. పంటలకు పెట్టిన పెట్టుబడి నయాపైసా కూడా చేతికిరాలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే తమను ఆదుకోవాలి. లేకుంటే మరింత సంక్షోభంలో కూరుకుపోతాం.' అంటూ రైతులు కేంద్ర కరువు బృందం ఎదుట సమస్యలను ఏ'కరువు' పెట్టారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించాయి. భారత వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వంలో పది మంది సభ్యులతో వచ్చిన కేంద్ర బృందం మంగళవారం, బుధవారం పర్యటించారు. మొదటి రోజున మంగళవారం నాడు అనంతపురం జిల్లాలో మూడు బృందాలుగా విడిపోయి అనంతపురం, ఆత్మకూరు, కళ్యాణదుర్గం, గుమ్మగట్ట, గుత్తి, పామిడి మండలాల్లో పర్యటించాయి. అంతక మునుపు జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లాలో నెలకొన్న వాతవరణ పరిస్థితులు, పంటనష్టం, వివరాలతోపాటు, ఎంత మేరకు సహాయం అవసరమవుతుందన్న నివేదికలను జిల్లా అధికారుల నుంచి స్వీకరించారు. అనంతరం క్షేత్ర స్థాయి పర్యటన జరిపారు. అయితే మొదటి రోజు పర్యటన మొత్తం ఆలస్యంగ సాగింది. దీంతో రైతులు పూర్తి స్థాయిలో తమ సమస్యలు చెప్పుకోవడానికి వీల్లేకుండాపోయింది.

రెండో రోజు పర్యటన ఇలా సాగింది :

సత్యసాయి జిల్లాలో ఒక బృందమే పర్యటించింది. పరిగి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో పర్యటించింది. పరిగి మండలంలోని మోద గ్రామంలో మొదట పర్యటించింది. అక్కడ రైతులతో ముఖాముఖి అయ్యారు. అదే విధంగా అశ్వర్థమ్మ అనే మొక్కజొన్న రైతు పొలంలోకెళ్లి ఎండిన పంటను పరిశీలించారు. మూడు ఎకరాల్లో రూ.75 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేస్తే వర్షాలు లేక పండిపోయిందని ఆమె కరువు బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సందర్భంలో మరికొంత మంది రైతులు తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు. మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొన్నారు. పంటనష్టానికి పరిహారంతోపాటు, నిత్యం కరువు ప్రాంతమైన ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించే విధంగా కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. అనంతరం అదే మండలంలోని పుట్లగుర్లపల్లిలో కందిపంటను పరిశీలించారు. అటు తరువాత మడకశిర మండలంలోని బుల్లసముద్రం గ్రామంలో లక్ష్మిదేవికి చెందిన కందిపంటను పరిశీలించారు. వర్షాభావంతో కందిపంట కూడా చేతికొచ్చే పరిస్థితుల్లేవని తెలిపింది. గుడిబండ మండలంలోని జంబులబండ గ్రామంలో బాలకృష్ణప్ప పొలంలో ఎండిన కందిపంటను పరిశీలించారు. అమరాపురం మండలంలోని వలస గ్రామంలోనే పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టానికి సంబందించి రూ.63.29 కోట్లు నిధులు అవసరమవుతాయని జిల్లా జాయింట్ కలెక్టరు చేతన్ కేంద్ర కరువు బృందానికి వివరించారు. బుధవారంతో అనంతపురం, సత్యసాయి జిల్లాల పర్యటన ముగిసింది. గురువారం నాడు చిత్తూరు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించనుంది.

రెండు జిల్లాలకు అడిగిన సహాయం ఇది

అనంతపురం జిల్లాకు రూ.329.82 కోట్లు నిధులు వ్యవసాయం, తాగునీరు, ఉపాధి హామీ అన్నింటికీ కలిపి నిధులు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి మొత్తం కలిపి 63.29 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇందులో కేంద్రం నుంచి ఏ మేరకు సహాయం అందుతుందన్నది చూడాల్సి ఉంది.

అంగన్‌వాడీల ఆగ్రహం

- 2వ రోజు కొనసాగిన సమ్మె
- చంటి బిడ్డలతో పాటు నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. 5126 అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీలు ఆందోళనబాటపట్టారు. పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంపు, ఇతర సమస్యలపై జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమ్మెలో భాగంగా మొదటి రోజు మంగళవారం నాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ముందు టెంట్‌లు వేసుకుని ఆందోళన చేపట్టారు. రెండవ రోజు బుధవారం నాడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద సమ్మె కొనసాగించారు.



బత్తలపల్లి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

తెలంగాణలో కంటే కనీసం రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తాని అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు గ్రాట్యూటీతో పాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్ వాడీ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాలు మూతపడ్డాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజక్టుల పరదిలో 30 మండలాల్లో 2301, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల పరిధిలో 33 మండలాల్లో మెయిన్ సెంటర్‌లు 2198, మినీ సెంటర్‌లు 627 మొత్తం 2825 అంగన్ వాడి కేంద్రాలు మూతబడ్డాయి.

వార్తలు 6లో

యాప్‌ల భారం తగ్గించాలి



అంగన్‌వాడీ వర్కర్లకు ఎఫ్‌ఆర్‌ఎస్ వంటి యాప్స్ తీసుకొచ్చారు. దీని వల్ల తీవ్ర పనిభారం పెరిగింది. తక్షణం ఈ యాప్‌ల భారం తగ్గించాలి. సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదు. పని భారం పెంచారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లకు నెట్ రాదు. కార్యాలయాల అవసరాలకు సొంత ఫోన్లు వాడుతున్నాం. లోడ్ పెరిగి అవి కూడా మొరాయిస్తున్నాయి. బిల్లులు సక్రంగా రాకపోవడంతో బయట వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి సెంటర్‌ల నిర్వహణ చేయాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వం అంగన్ వాడీల సమస్యలను పరిష్కరించాలి.

లావణ్య, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి.

వేతనం పెంచి, సమస్యలు పరిష్కరించాలి



చాలీచాలని వేతనాలతో అంగన్ వాడీ కార్యకర్తలుగా పని చేస్తున్నాం. పని ఎక్కువ వేతనం తక్కువగా తమ జీవితాలు సాగుతున్నాయి. సెంటర్ నిర్వహణతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. సీఎం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ అమలు చేసి, పని భారాన్ని తగ్గించాలి.

శిరిషా, యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు.

ప్రధాన డిమాండ్లు...

- అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- సుప్రీంకోర్టు చెప్పిన మేరకు గ్రాట్యూటీపై అమలు చేయాలి.
- మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి.
- రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలకు పెంచాలి. పెన్షన్ ఇవ్వాలి.
- మెనూ ఛార్జీలు పెంచాలి.
- పెండింగ్‌లో ఉన్న బిల్లులు, సెంటర్ల అద్దెలను వెంటనే విడుదల చేయాలి.
- కేంద్రాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలి.
- అంగన్‌వాడీలపై రాజకీయ జోక్యాన్ని నివారించాలి.
- యాప్‌ల వేధింపులను నివారించాలి.

కదిరిలో వైసిపికి భారీషాక్



విజయవాడకు బయలు దేరిన నాయకులు

టిడిపిలో చేరనున్న 500 మంది
నేడు పార్టీ తీర్థం పుచ్చుకోనున్న నాయకులు

ప్రజాశక్తి, కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలో వైసీపీకి భారీషాక్ తగిలింది. వైసీపీకి చెందిన పలువురు మండల స్థాయి నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు దాదాపు 500 మంది ఆ పార్టీకి గుడ్ బై చెప్పి. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి కండువా వేసుకోవడానికి సిద్ధమయ్యారు. అందులో భాగంగానే బుధవారం రాత్రి విజయవాడకు బయలుదేరారు. ఎయిర్ కూలర్ ప్రైవేట్ బస్సులలో నియోజకవర్గంలోని పలువురు వైసిపి నాయకులు విజయవాడకు తరలి వెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ మారుమూల గ్రామాలకు వెళ్లిన రహదారులు సరిగా లేక ఇబందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి కుంటుపడిందన్న ఉద్దేశ్యంతో వైసిపికి గుడ్‌బై చెప్పి టిడిపిలో చేరుతున్నామని వారు వెల్లడించారు. కదిరిలో టిడిపికి పూర్వవైభం తీసుకురావటానికి కృషి చేస్తామని వారు చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని బండ్లపల్లి పంచాయతీలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కేంద్ర బృందం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ టీం శాస్త్రవేత్తలు అనిల్ కుమార్, గోవిందరాజు బుధవారం పరిశీలించారు. ఇంకుడు గుంతలను పరిశీలించారు.ఉపాధి హామీ కింద సాగు చేసిన పండ్ల మొక్కలను పరిశీలించి రైతులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శివశంకర్, ఏపీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీవో నాగిరెడ్డి, సిబ్బంది మనోహర్ ,రామ్మోహన్ రెడ్డి ,వెంకటేష్ ,నరసింహులు, హేమాద్రి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారీకి చర్యలు

పుట్టపర్తి రూరల్: తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలని పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ తహశీల్దార్లకు, బిఎల్ఒలకు సూచించారు. ఈ మేరకు పుట్టపర్తి ఆర్డీవోకార్యాలయంలో ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లకు, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో షేక్ జిలాని, డిఎఒతో పాటు ఆయామండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

మడకశిర : కాంగ్రెస్ పార్టీ హయాంలోని ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తెలిపారు. మున్సిపాలిటీలోని మల్లినాయకపల్లి, చౌటుపల్లి, వడ్రపాళ్యం, చీపులేటి, బేగార్లపల్లి, క్రాస్ , మాలేరోప్పం, అక్కంపల్లి, గొల్లహట్టి, మెట్టబండపాళ్యం, బొమ్మయ్య గారి ఇండ్లు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ముందడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజునాథ, క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఈశ్వరప్ప, నాయకులు గంగలవాయిపాళ్యం ప్రభాకర్ రెడ్డి, బాబుప్రసాద్, పి.రామాంజనేయులు, నాగభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ను విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని ఇఒఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖధికారి ప్రసాద్,అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు హాజరయ్యారు.

తెరపైకి ఆశావహులు..!

- కదిరి అధికార పార్టీ టికెట్టు కోసం పలువురి ఆరాటం
- సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారాలు



ఎమ్మెల్యే డా॥సిద్ధారెడ్డి



బత్తలపల్లి హరి



పవన్‌కుమార్



ఇస్మాయిల్



మగ్బుల్



సాధత్



షాకీర్



పూల శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్



తెలంగాణలో ఫలితాలు వెల్లడైన అనంతరం ఆ ప్రభావం రాష్ట్ర రాజకీయాలపై పడింది. ముఖ్యంగా అధికార పార్టీలో గత మూడు రోజులుగా అభ్యర్థుల మార్పు అంటూ సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ సారి సిట్టింగ్‌ల స్థానంలో కొత్తవారికి అవకాశం ఇస్తామంటూ ఆ పార్టీ నేతలు ప్రకటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపి టికెట్టును తెచ్చుకునేందుకు తెరపైకి పెద్ద సంఖ్యలోనే ఆశావహులు వస్తున్నారు. కదిరి నియోజకవర్గంలో ఈ పోటీ మరింత తీవ్రంగా కన్పిస్తోంది. ప్రస్తుతం ఇక్కడ అధికార పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా డా॥సిద్ధారెడ్డి ఉన్నారు. ఆ పార్టీ అధిష్టానం ఈయనకు మరోసారి అవకాశం కల్పిస్తారా.? లేదా.? అన్నదానిపై స్పష్టత ఇవ్వలేదు. ఈసారి ఆయనకు టికెట్టు ఉండదని, ఆయన స్థానంలో కొత్తవారికి ఇస్తారని గత ఆరు నెలలుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆపార్టీ నుంచి టికెట్టు కోరే వారి సంఖ్య పెద్దగానే ఉంటోంది. ఇప్పటికే కదిరి నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను మరోసారి బరిలోకి దింపుతామంటూ ఆ పార్టీ అధిష్టానం స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. దీంతో వైసిపి ఆయన్ను ఢీకొట్టే అభ్యర్థిని ఎంపిక చేసే పనిలో పడ్డారు. అందులో భాగంగా బీసీ వర్గానికి చెందిన రాష్ట్ర వైసిపి సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను ప్రకటిస్తే బాగుంటుందని ఆయన వర్గం వారు వెల్లడిస్తున్నారు. ఒకవేళ మైనార్టీకి ఇస్తే మగ్బుల్‌బాషాకు వస్తుందని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఇక ప్రస్తుత ఎమ్మెల్యే సిద్ధారెడ్డి సైతం ఈ సారి టికెట్టు తనకే వస్తుందని ఆయన అనుచరుల వద్ద ధీమాగా చెబుతున్నారు. వీరితో పాటు ఎస్ఎండి.ఇస్మాయిల్, వాల్మీకి పాఠశాల అధినేత వైసిపి రాష్ట్ర నాయకులు పవన్ కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు సాదత్ అలీఖాన్, మాజీ మంత్రి మహమ్మద్ షాకీర్, వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి, బలిజ సామాజిక వర్గానికి చెందిన పాల్యం సుధాకర్ల పేర్లు టికెట్టు ఆశిస్తున్న వారి జాబితాలో ఉన్నాయి. అధిష్టానం మాత్రం ఇప్పటి వరకు వీరిలో ఎవరికీ టికెట్టుపై భరోసా ఇవ్వలేదు. నాయకులు మాత్రం ప్రస్తుతం ఉన్న సమీకరణల నేపథ్యంలో ఈసారి టికెట్టు తమకే వస్తుందని వారి అనుచరుల వద్ద చెప్పుకుంటున్నారు. టికెట్టు ఆశిస్తున్న వారంతా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. ఆయన చెప్పిన వారికే కదిరి టికెట్టు వస్తుందన్న సమాచారంతో నాయకులు రామచంద్రారెడ్డి మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికార వైసిపి 2024 ఎన్నికల్లో కదిరి నుంచి ఎవరిని బరిలోకి దింపుతుందన్న దానిపై స్పష్టత వచ్చేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మహిళా పోలీసుల పాత్ర కీలకం : ఎస్పీ

ప్రజాశక్తి - బుక్కపట్నం

ఎన్నికల సమీపిస్తున్న వేళ గ్రామాలలో మహిళా పోలీసులు సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులను సమర్థంగా నిర్వహించాలని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. మహిళా పోలీసులు గ్రామాలలో మహిళలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకొని సైబర్ నేరగాళ్ళ, దిశ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, సిఐలు రామయ్య, రాజేంద్రనాథ్ యాదవ్, ఎస్ఐ నరసింహుడు, ఎఎస్ఐ రమణ, రంగా నాయక్, పోలీసులు పాల్గొన్నారు.



బుక్కపట్నం స్టేషన్‌లో ఎస్పీ

నల్లమాడ : నల్లమాడ సర్కిల్ పరిధిలో శాంతి పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం నల్లమాడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసులు పలు సూచనలు చేశారు. గంజాయి, మద్యం, జూదంపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని ఆదేశించారు ఈ సందర్భంగా కేసులు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్, నల్లమాడ సిఐ రాజేంద్రనాథ్ యాదవ్, అమడగూరు, ఒడిసి ఎస్ఐలు, నల్లమాడ పోలీసులు పాల్గొన్నారు

ఆహారభద్రత ప్రజల హక్కు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

అర్హులకు ఆహార భద్రత అనేది ఒక హక్కుగా రాజ్యాంగంలో పేర్కొందని పౌర సరఫరాల జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లో ఆహార పౌరసరఫరాల శాఖ జిల్లా స్థాయి విజిలెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పౌరసరఫరాల శాఖ అధికారులు సింధు, డిఎం అశ్వత్ నాయక్, ఆహార భద్రత అధికారి రామచంద్ర, తూనికలు కొలతలు శాఖ అధికారి సుధాకర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బిసి సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, చౌక దుకాణాల డీలర్లు జిల్లా ఆహార భద్రత విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఆహార భద్రతలో భాగంగా ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం నడుపుతోందన్నారు. దీనిపై సభ్యులు సమావేశం దృష్టికి తగిన సలహాలు సూచనలు ఇస్తే క్షేత్రస్థాయిలో వినియోగదారుల రక్షణ చట్టం ను పకడ్బందీగా అమలు చేయడానికి అవకాశం ఉందన్నారు. జిల్లాలోని వివిధ సంక్షేమ వసతి గృహాలలో పౌర సరఫరాల శాఖ సరఫరా చేస్తున్నా సరుకులపై సంబంధిత అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి, విద్యాశాఖ ఏడీ రామకృష్ణయ్య, సభ్యులు వెంకటరమణారెడ్డి, గుడిబండ జెడ్పీటీసీ రామాంజనేయులు, డాక్టర్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదు

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు సమ్మెను విరమించేది లేదని సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 2వ రోజు కొనసాగింది. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు నిరసన దీక్షలు చేపట్టారు. వీరికి సిపిఎం, టిడిపి, జనసేన పార్టీలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా చంటిబిడ్డలు, కుటుంబ సభ్యులతో కలిసి అంగన్‌వాడీలు దీక్షల్లో పాల్గొన్నారు. తమ న్యాయమైన సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు.



సోమందేపల్లిలో నిర్వహించిన సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రభుత్వంపై అంగన్‌వాడీల ఆగ్రహం

జిల్లా వ్యాప్తంగా 2వ రోజు కొనసాగిన సమ్మె

పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి - సోమందేపల్లి

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సిపిఎం జిల్లాకార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మణికంఠ కాలనీలో గల ఐసిడిఎస్ కార్యాలయం వద్ద రెండవ రోజైన బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెను కొనసాగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇంతియాజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలపై చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌కు కేటాయించిన బడ్జెట్లో 40 శాతం నిధులను తగ్గించడం అన్యాయమన్నారు. ఈవిషయంపై రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయలేకపోవటం అమానుషమన్నారు. అంగన్వాడీల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటాన్ని కొనసాగిస్తారని అందుకు సిపిఎం, ప్రజాసంఘాల మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : తమ సమస్యల పరిష్కారం కోరుతో అంగన్వాడీలు రెండో రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాములు, అంగన్వాడీ యూనియన్ నాయకులు సరస్వతి, పద్మావతి, అంగన్వాడీ కార్యకర్తలు భారతి, లక్ష్మీదేవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా నాయకులు బడా సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు వేమన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు శివన్న, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు సరస్వతి, పద్మావతి, భాగ్యమ్మ, కార్యకర్తలు మంజు భారతి, లక్ష్మీదేవి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నుండి చేపట్టిన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్ల ధర్నా బుధవారం రెండవ రోజు కూడా సాగింది. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీదేవి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి : అంగన్వాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బి ఎస్ గురుమూర్తి, మండల కన్వీనర్ దాసిరెడ్డి, కార్యదర్శి ఈరన్న డిమాండ్ చేశారు. బుధవారం రొళ్ల తహసీల్దార్ కార్యాలయం ముందు అంగనవాడి ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షకు టిడిపి నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, కృష్ణమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీలు తమకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. అంగన్వాడీలకు సిపిఎం సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న , సిపిఎం సిఐటియు నాయకులు బాబు, వెంకటేష్, పోతలయ్య, లక్ష్మీనారాయణ, రహంతుల్లా, చాంద్‌బాషా, అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రజియా, ,అంగన్వాడి టీచర్లు ఇందుమతి హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : అంగన్వాడీలపై జగన్ కు ఎందుకంత కక్ష అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ విమర్శించారు. బుధవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో రెండవ రోజు అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు, ఆంజనేయులు, టైలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు కొనసాగిన సమ్మె : అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండో రోజు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మోకాళ్ళ పై నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, తిప్పన్న, రాజు రావు, తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, మండల నాయకురాలు మాబున్నీషా, సావిత్రమ్మ, వరలక్ష్మి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు బి. కె.పార్థసారథి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోనిసబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమానికి టిడిపి అధ్యక్షులు సంఘీభావం తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: అంగన్వాడీల నాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్యసాయి జిల్లా ఐసిడీస్ ప్రాజెక్ట్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు రెండు రోజులుగా చేస్తున్న సమ్మెకు పల్లె మద్దతు తెలిపారు. అనంతరం సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ పేదలందరికీ బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనే ముఖ్యమంత్రి అంగన్వాడీలకు మాత్రం సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వం దిగి రాకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, సిఐటియు, సిపిఎం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : తమ సమస్యల పరిష్కరానికై 2వ రోజు కదిరి పట్టణ మునిసిపల్ ఆఫీసు నందు అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు . ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నిసా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.ఎల్. నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కదిరి పట్టణ సిఐటియు నాయకులు బాబ్జాన్, ఫాజిల్, ముస్తాక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : అంగన్వాడీల సమ్మె బుధవారానికి 2వ రోజుకు చేరుకుంది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈసమ్మెలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం మండలంలోని అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలం లోని అంగన్వాడీలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంగన్ వాడీలు తమ సమస్యల పరిష్కారానికి సమ్మె బాట పట్టారు. అందులో బాగంగానే సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం తహశీల్దార్ కార్యాలయం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రవీణ్ కుమార్,వెంకటేష్, రామచంద్రచ శోభమ్మ, రామతులసి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీలు రామాంజినమ్మ, సావిత్రమ్మ, పద్మ, శంకరమ్మ, రాధ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది స్థానిక తహశీల్దార్‌కార్యాలయం ముందు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బత్తలపల్లి ప్రాజెక్టు పరిధిలోని ముద్దుగుబ్బ, తాడిమర్రి, బత్తలపల్లి మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా నాయకురాలు దిల్షాద్ మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బత్తలపల్లి ప్రాజెక్టు యూనియన్ నాయకురాలు వాసంతి, రజియా, భారతి,వసంత,రజిత,పుష్పాలత, శివమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : అంగన్వాడీల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ మంత్రి పల్లె డిమాండ్ చేశారు. బుధవారం మహ్మదాబాద్ క్రాస్ లోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి శ్రీరాములు, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, రమణ, బూదిలి ఓబుల్ రెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుడిబండ : గుడిబండ ఐసిడిఎస్ కార్యాలయం ముందు రెండవ రోజు అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడి కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. వీరి సమ్మెకు టిడిపి, కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి మహాదేవమ్మ, నాయకులు అనసూయ, రామక్క, సరస్వతి, సిఐటియు బాబూఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు అన్నారు. రెండవ రోజు సమ్మె సందర్భంగా బుధవారం పట్టణంలోని పెనుకొండ రోడ్డులో అంగన్ వాడీలు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు సిఐటియు, కెవిపిఎస్, ఆటో యూనియన్‌తో పాటు ఇతర ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజక్టు కార్యదర్శి లావణ్య, సిఐటియు నాయకులు రాము, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, అంగన్వాడి యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు శోభారాణి, కోశాధికారి శిరీషాతో పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కనగానపల్లి : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బత్తల కదిరప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్లు చేస్తున్న సమ్మె బుధవారానికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



చిలమత్తూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు, నాయకులు నిరసన



కదిరిలో నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీలు, నాయకులు

జింక మృతి

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం ఆవినకుంట తండా పరిసర ప్రాంతాల్లో జింక మృతిచెందింది. మృతిచెందిన జింకను కొందరు తీసుకుని వెళ్లే సమయంలో గ్రామస్తులు వారిని విచారించారు. వాహనం ఢీకొనడంతో జింక మృతిచెందిందని వారు చెప్పారు. అయితే ఈ విషయంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు జింకను వేటాడి చంపారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే నియోజవర్గానికి చెందిన ప్రజాప్రతినిధి ఒత్తిడితో కేసు లేకుండా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

I.A. NO:41/2023 in O.S. NO:42/2023

Between:

వట్టం రమేష్ రెడ్డి,
మంగళ మడుగు లక్ష్మిదేవమ్మ ...పిటిషనర్స్

మరియు

C.ధన్య కుమార్ S/o B.G. చెన్నప్ప, వయస్సు 50 సం॥లు,
R/o ఈతోడు గ్రామం, తనకల్లు మండలం,
శ్రీ సత్యసాయి జిల్లా. ...రెస్పాండెంట్ నెం:3

<u>3వ రెస్పాండెంట్‌కు సమను</u>

పై I.A.లో ప్రతివాది అయిన C.ధన్య కుమార్ S/o B.G. చెన్నప్ప, R/o ఈతోడు గ్రామం, తనకల్లు మండలం అయిన మీపై పిటిషనర్స్ 1 & 2 అయిన వి.రమేష్ రెడ్డి, యం.లక్ష్మిదేవమ్మ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచు పై I.A దాఖలు చేసివున్నారు. పై దావాలో మీ హాజరు నిమిత్తమై 14/12/2023 న పై కోర్టులో I.A 41/2023 వున్నది. కావున మీరు ఖుద్దున గాని వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవచ్చును. లేని యెడల పై I.A 41/2023 మీ పరోక్షమున తీర్మానించబడునని యావనందికి తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:14/12/2023
స్థలం: కదిరి

కె.రమేష్ నాయడు,
కె.శ్రీహరి నాయుడు,
అడ్వకేట్స్ కదిరి. సెల్:8309377268

మహారాజశ్రీ కదిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు

O.S. NO:42/2023

Between:

వట్టం రమేష్ రెడ్డి,
మంగళ మడుగు లక్ష్మిదేవమ్మ ...వాదులు 1 & 2

మరియు

C.ధన్య కుమార్ S/o B.G. చెన్నప్ప, వయస్సు 50 సం॥లు,
R/o ఈతోడు గ్రామం, తనకల్లు మండలం,
శ్రీ సత్యసాయి జిల్లా. ...ప్రతివాది నెం:3

<u>3వ ప్రతివాదికి సమను</u>

పై దావాలో ప్రతివాది అయిన C.ధన్య కుమార్ S/o B.G. చెన్నప్ప, R/o ఈతోడు గ్రామం, తనకల్లు మండలం శ్రీ సత్యసాయి జిల్లా అయిన నీపై పై వాదులు వి.రమేష్ రెడ్డి, యం.లక్ష్మిదేవమ్మ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచు పై దావా O.S.42/2023 దాఖలు చేసివున్నారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట 14/12/2023 న ఖుద్దున గాని వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవచ్చును. లేని పక్షంలో మీ పరోక్షమున పై దావా తీర్మానించబడునని యావనందికి తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:14/12/2023
స్థలం: కదిరి

కె.రమేష్ నాయడు,
కె.శ్రీహరి నాయుడు,
వాదిపరం వకీల్లు కదిరి. సెల్:8309377268

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు



ఉదయం 11 గంటలైనా సచివాలయానికి తాళం వేసి ఉన్న దృశ్యం

ప్రజాశక్తి మడకశిర రూరల్

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థ ను తీసుకొస్తే కొంతమంది సచివాలయ ఉద్యోగులు మాత్రం ప్రభుత్వ ఆశయానికి తుట్లు పొడుస్తున్నారు. మడకశిర మండల పరిధిలోని మనూరు గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆ గ్రామసచివాలయ భవన తాళాలు ఉదయం 11 గంటలైనా తీయలేదు. ఒక్క మహిళా పోలీస్ తప్ప మిగతా సచివాలయ ఉద్యోగులు రాకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు పనుల మీద సచివాలయానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనతిరిగారు. గ్రామస్తులు నరేష్, నరసింహమూర్తి, గోవింద్ మాట్లాడుతూ ప్రతిరోజు సచివాలయంలో ఇదే పరిస్థితి ఉంటుందని విమర్శించారు. సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఇదేమని అడిగితే ఫీల్డ్ మీద ఉన్నారని ఇక్కడున్న సిబ్బంది చెబుతారని అన్నారు. సచివాలయంలో ఉద్యోగులు లేకపోతే ఇక సచివాలయాలు ఎందుకని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని పాలసముద్రం గ్రామానికి చెందిన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి అలాగే అనుభవంలో ఉన్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వటానికి తగిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రంగనాయకులు తెలిపారు. ఈ మేరకు ఇళ్లస్థలాల సమస్యపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ఆధ్వర్యంలో పాలసముద్రం గ్రామానికి చెందిన పేదలతో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బుధవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రంగనాయకులు మాట్లాడుతూ పాలసముద్రం గ్రామానికి చెందిన అర్హులైన పేదలకు అనుభవంలో ఉన్న వడ్డెర్లకు పొజిషన్ సర్టిఫికెట్లు వీలైనంత తొందరగా ఇస్తామని హామీ ఇచ్చారు. గతంలో పట్టాలు పొందిన వారికి పట్టాలు పరిశీలించి స్థలాలు కేటాయించి న్యాయం చేస్తామన్నారు. ఇళ్లస్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను ఆధార్, రేషన్, ఓటరు కార్డు ప్రామాణికంగా తీసుకొని దరఖాస్తులను ఆన్లైన్లో నమోదు చేసుకొని 90 రోజుల్లో పట్టాలు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పేదల ఐక్య పోరాటంతో ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి అధికారుల నుండి సానుకూలత వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు అంజలాదేవి, వెంకట లక్ష్మమ్మ, అచ్చమ్మ, అశ్విని, నారాయణ, రామాంజనేయులు, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు




తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

పంటనష్టపోయిన రైతులను ఆదుకోండి



పరిగిలో ఎండిన పంటపొలాలను పరిశీలిస్తున్న అధికారులు



ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కరువు బృందం

ప్రజాశక్తి మడకశిర రూరల్, మడకశిర

కరువు పరిస్థితులతో పంటనష్టపోయిన రైతులను న్ని విధాలా ఆదుకోవాలని ఆయా పార్టీల నాయకులు కేంద్ర కరువు బృందాన్ని కోరారు. బుధవారం మడకశిర మండలం బుల్లసముద్రం, హరే సముద్రం గ్రామాల్లోని పంటపొలాలను కరువు బృందం ప్రతినిధులు దేవేందర్ రావు, ప్రదీప్ కుమార్, అంజు బసేరా పరిశీలించారు. అనంతరం కదిరేపల్లి ఆర్‌బికెలో పంట నష్టపోయిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కేంద్ర కరువు బృందాన్ని కలిసి సమస్యను వివరించారు. తమ ప్రాంతంలో ఏనాడు లేనంతగా కరువు విలయతాండవం చేసిందన్నారు. రైతులు నష్టపోయారని, పశువులకు మేత కూడా లేకుండా పోయిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కేంద్రం రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో రైతులు లక్ష్మీనారాయణ, నారాయణ గౌడ్, కృష్ణమూర్తి మనోహర్, భక్తర్ సాబ్, కన్నా, రామాంజనేయులు, శ్రీనివాస్, నాగేంద్ర, రవికుమార్ తదితరులు కరువు బందానికి తమ సమస్యను వివరించారు. నియోజకవర్గంలో 70 శాతానికి పైగా భూములు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయని ఉపాధి కోసం దాదాపు 25 వేల మంది బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లారని చెప్పారు. తీవ్ర దుర్భిక్షం బారిన పడిన నియోజకవర్గ రైతులను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కరువు బృందం డైరెక్టర్ దేవేంద్రరావు, జిల్లా, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని వలస గ్రామపంచాయతీకి చెందిన రైతులు నాగన్న, తిప్పేస్వామి పొలాలను కేంద్రకరువు బృందం పరిశీలించింది. మండల కరువు పరిస్థితులను జెడ్పీటీసీ సారక్క, నరసింహమూర్తి, జేసిఎస్ కన్వీనర్ శ్రీనివాస్ రెడ్డి ,ఎంపీపీ ఈరన్న, తెలుగుదేశం నాయకులు గణేష్ ,శివరుద్రప్ప, హనుమంతరాయ, జయ కుమార్, సర్పంచులు ఎంపీటీసీలు కేంద్ర కరువు బృందానికి వివరించారు.

కరువు బృందానికి నాయకుల వినతి

గుడిబండ : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతుల జాబితాను తయారుచేసి వాటి నష్టం అంచనాను కేంద్రానికి నివేదిస్తామని కరువు బందం డైరెక్టర్ దేవేంద్రరావు తెలిపారు. మండలంలోని జమ్మల బండ గుడిబండ గ్రామాల్లో కేంద్ర కరువు బృందం పర్యటించి రైతులు సాగుచేసిన పంటపొలాలను పరిశీలించింది.

పరిగి : మండలంలో గతంలో ఎప్పుడూ లేని తీవ్రమైన కరువు నెలకొందని రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. కేంద్ర కరువుబృందం పరిగి మండలంలోని మోద గ్రామంలో పర్యటించింది. ఈసందర్భంగా కరువు బృందం అధికారులు మహిళా రైతు అశ్వత్థమ్మ పొలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతుసంఘం నాయకులు మండలంలో నెలకొన్న కరువు పరిస్థితిని అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శంకర నారాయణ, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, ఎడిఎఅల్తాఫ్ అలీతో పాటు ఆయా శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

హిందూపురం : పట్టణంలోని డిబి కాలనీలోని హరిచంద్ర ఘాట్ శ్మశాన వాటికలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వన్ టౌన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. లేపాక్షి కి చెందిన బసన్న గారి బాలాజీ లారీ పనికి పోయి తన సొంత గ్రామానికి వెళ్లడానికి రహమత్ పురం సర్కిల్ లో బస్సు కోసం వేచి ఉన్నాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనాల్లో వచ్చిన హిందూపురం పట్టణం లక్ష్మీపురానికి చెందిన నరసప్ప గారి తిరుమలేష్, పట్టణంలోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన బజంత్రి కళ్యాణ్ కుమార్, శ్రీకంఠపురానికి చెందిన అరవింద్ రెడ్డి బాలాజీతో మాటలు కలిపారు. తాము కూడా లేపాక్షి వెళ్తున్నామని, వస్తే తమ ద్విచక్ర వాహనంలో వదులుతామని నమ్మబలికారు. వారిమాటలు నమ్మిన బాలాజీ ద్విచక్రవాహనంలో కూర్చోగా వారు హరిచంద్ర ఘాట్ లోకి బాలాజీని తీసుకువెళ్లి సిమెంట్ ఇటుకలతో కొట్టి హత్య చేశారు. అతని వద్ద ఉన్న సెల్ ఫోన్, డబ్బులను లాక్కొని వెళ్లిపోయారు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలాజీని హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు జనరల్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్య సేవలు పొందుతూ ఈనెల 7వ తేదీన బాలాజీ మృతిచెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను పట్టణ సమీపంలోని వివేకానంద పాఠశాల వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ద్విచక్ర వాహనం, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తున్నామని డీఎస్పీ తెలిపారు. కేసును చేధించిన వన్ టౌన్ సీఐ ఈరన్న, ఎస్ఐ హారున్ భాషా తో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

కదిరి అర్బన్ : కదిరి నియోజకవర్గం గాండ్లపెంట మండలం పెద్ద తండాకు చెందిన ఇద్దరు విద్యార్థులు కదిరి బస్టాండులో తప్పిపోయారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయక్, విజయకుమారి దంపతుల కుమారులు 7వ తరగతి చదువుతున్న ధనుష్ నాయక్, 5వ తరగతి చదువుతున్న శశాంత్ నాయక్ నల్లమాడ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్నారు. శని, ఆదివారం సెలవులు కావడముతో వారి సొంత ఊరికి వచ్చారు. తిరిగి మంగళవారం పిల్లలను వారి తల్లి కదిరి నుండి నల్లమాడకు బస్సులో పంపేందుకు బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కి స్కూల్ కు వెళ్లిపోతామని పిల్లలు చెప్పడంతో ఆమె ఇంటికి వెళ్ళిందన్నారు. అయితే పిల్లలు ఇద్దరూ పాఠశాలకు రాలేదని నల్లమాడ గిరిజన ఆశ్రమ స్కూల్ నుండి సంబందిత స్కూల్ టీచర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో తమ పిల్లల ఆచూకీ తెలపాలని బాధితులు ఫిర్యాదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పిల్లల ఆచూకి తెలిస్తే వారి తల్లిదండ్రుల సెల్ : 7675095022, 8332902632 కు గాని లేదా కదిరి టౌన్ సిఐ సెల్ : 94407 96851 కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని పట్టణ సిఐ కోరారు.

సెబ్ అధికారుల దాడులు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లాలో అక్రమ మద్యం, ఇసుక రవాణాపై సెబ్ అధికారులు మంగళవారం ముమ్మర దాడులు నిర్వహించారు. జిల్లా పరిధిలోని తనకల్లు పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు టన్నుల ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. అంతేకకాకుండా నిందితుడి నుంచి 196 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసారు. మడకశిర పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు టన్నుల ఇసుకను మడకశిర పోలీసులకు అప్పగించారు. కొడికొండ చెక్ పోస్ట్ వద్ద 40 కర్నాటక మద్యం పాకెట్లు, తూముకుంట చెక్ పోస్ట్ వద్ద 24 కర్నాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసారు. పుట్టపర్తిపరిధిలో 24 కర్నాటక మద్యం పాకెట్లు, హిందూపురం స్టేషన్ పరిధిలో 42 కర్నాటక మద్యం పాకెట్లు సీజ్ చేసారు. హిందూపురం మున్సిపాలిటీ లో మట్కా నిర్వహిస్తున్న వారిపై దాడులు నిర్వహించి కేసు నమోదు చేసి వారి వద్ద నుండి రూ. 11930 నగదును స్వాధీనం చేసుకుని హిందూపురం టౌన్ పోలీసులకు అప్పగించారు. కదిరి పరిధిలోని కట్ల తండాలో పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు : మండల పరిధిలోని బొమ్మల కుంట మలుపు వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులు గాయపడ్డారు.కదిరి రెవిన్యూ డివిజన్ లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే విజయ కుమారి, తనకల్లు మండల సర్వేయర్ నరేష్ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బొమ్మలకుంట మలుపు వద్ద వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని గౌడనహళ్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచి పుట్టమ్మ హనుమంతురాయప్ప తెలిపారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనానికి సర్పంచి స్పందించారు. ఎన్నో ఏళ్ల నుండి నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ప్రస్తుతం పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో తమ సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

పరిగి : మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన మిత్ర వాటర్ ప్లాంట్‌ను నాలుగేళ్ల తర్వాత ఎమ్మెల్యే శంకర్ నారాయణ చొరవతో బుధవారం ప్రారంభించారు. నాలుగేళ్లుగా తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డామని ఈ ప్లాంట్ ప్రారంభంతో సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కదిరి అర్బన్ : కదిరి నియోజకవర్గం తనకల్లు మండలం మండిపల్లిలో ఏర్పాటు చేసిన సీతారాముల స్వామి దేవాలయ అభివృద్ధికి వైసిపి నాయకులు బిఎస్. మక్బుల్ అహ్మద్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆయన బుధవారం తన కార్యాలయంలో మండిపల్లి వాసులకు విరాళం అందించారు.

15 నుంచి క్రీడాపోటీలు

కొత్తచెరువు : ఈనెల 15వ తేదీ నుండి ఆడదాం ఆంధ్ర కార్యక్రమం కింద క్రీడా పోటీలను సచివాలయ పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఇఒఆర్‌డి సిద్ధారెడ్డి, ఎంఇఒ జయచంద్ర తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పిఇటిలతో సమావేశాన్ని నిర్వహించారు.సచివాలయాల్లో పేర్లను నమోదు చేసుకున్న క్రీడాకారులకు పోటీలను నిర్వహిస్తామన్నారు. గ్రామస్థాయిలో ఎంపికైన వారు మండల స్థాయిలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు అజయ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు

అన్నదానానికి విరాళం

హిందూపురం : స్థానిక బెంగళూరు రోడ్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం అన్నదానం భవన్‌లో జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలకృష్ణ రూ. 60వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు టిడిపి నియోజక వర్గ కో ఆర్డినేటర్ శ్రీనివాస, రావు, బాలకృష్ణ వ్యక్తి గత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షులు రమేష్ కుమార్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందరావు సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-హిందూపురం

అదనపు జిల్లా కోర్టు పరిపాలన అధికారిగా ఆనందరావు అందించిన సేవలు ప్రశంసనీయమని స్థానిక న్యాయమూర్తులు శైలజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి కొనియాడారు. ఆనందరావు శ్రీకాకుళానికి బదిలీ అయిన సందర్భంగా బుధవారం అదనపు జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎఒ ఆనందరావు నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు, కోర్టు ఉద్యోగులు. న్యాయవాదులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి 'పల్లె' పరామర్శ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్న 109 ఏళ్ల శతాధిక వృద్ధురాలు కుర్లి లక్ష్మమ్మను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం పరామర్శించారు. ఓబుళదేవరచెరువు మండలం తిప్పేపల్లి పంచాయతీ ఉబ్బలవారి పల్లి కి చెందిన 109 సంవత్సరాల లక్ష్మమ్మ రెండు రోజుల కిందట ఇంటి వద్ద కిందికి పడటంతో కాలు విరిగింది. దీంతో పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బుధవారం పరామర్శించారు.



వృద్ధురాలిని పరామర్శిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ఈసందర్భంగా పల్లె మాట్లాడుతూ 109 ఏళ్ల కలిగిన లక్ష్మమ్మ మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యంగా ఉందన్నారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గంలోని పుట్టపర్తి మండలం యర్ర నాగప్ప , నంజప్ప, కొత్త చెరువుకు చెందిన లక్ష్మీదేవి మనవరాలు శశాంక్, కర్నాటక నాగేపల్లి చెందిన చిన్న నరసింహులు తదితరులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఓబులేసు, బొమ్మయ్య, అంబులెన్స్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ప్రజా సంక్షేమం, అభివృద్ధే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తెలిపారు, 24 లక్షల రూపాయల వ్యయంతో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ లో నిర్మించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ కార్యాలయాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో సుమారు 1200 కోట్ల రూపాయల వ్యయంతో అదనపు విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫీడర్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, జెడ్పీటీసీ తిరుమల సేవే నాయక్, మండల కన్వీనర్ సివినారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, గ్రామ సచివాలయాల కార్యదర్శి భాస్కర్, మండల ఉపాధ్యక్షులు కృష్ణమ్మ వెంకటేశ్వర రెడ్డి, ముదిగుబ్బ సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. పట్టణంలోని తపాలా కార్యాలయం వద్ద ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన ప్లే కార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు సాంబశివ, నబీరసూల్, రామచంద్ర, వివేక్ రెడ్డి, కదిరి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

పుట్టపర్తి క్రైమ్ : గ్రామీణ తపాలా ఉద్యోగ శాఖ లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని రెండవ రోజు సమ్మె కొనసాగించారు. బుధవారం పట్టణంలోని తపాలా కార్యాలయం ముందు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లా బకాష్, ప్రసాద్, మౌలాలి, భారతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కారం కోసం గ్రామీణ తపాలా ఉద్యోగులు మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీసు వద్ద సమ్మెకు దిగారు. మండలంలోని అన్ని బ్రాంచిల పోస్టుమాస్టర్లు తమ విధులను బహిష్కరించి సమ్మెకు దిగారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

మడకశిర : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు అన్నారు. బుధవారం నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలంలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురుమూర్తి, దాసరెడ్డి, ఈరన్న, రామకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉందాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మండల వ్యాప్తంగా ఉన్నా నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని టిడిపి కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తి గత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర పిలుపు నిచ్చారు. బుధవారం రూరల్ మండలం బెంగళూరు రోడ్డులో ఉన్నా ఓ ఫంక్షన్ హాల్‌లో రూరల్ మండల నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు 2024 ఎన్నికలకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి పతనం ప్రారంభం : బికె

ప్రజాశక్తి -పెనుకొండ

నియోజకవర్గ ఇన్‌ఛార్జుల మార్పులే వైఎస్ జగన్ పతనానికి నాంది అని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి విమర్శించారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులను మార్చినంత మాత్రాన వైసిపి గెలుస్తుందని అనుకోవడం జగన్ మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఇన్‌ఛార్జులు 20శాతం తప్పు చేస్తే జగన్మోహన్ రెడ్డి 80శాతం తప్పులు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు సిద్ధ లింగప్ప, రవిశంకర్, నరహరి,జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, సర్పంచి శ్రీనివాసులు, జావీద్, చంద్రకాంతమ్మ, నాగప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కర్నాటక రాష్ట్రం గౌరీబిదనూరులో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కదిరి ఇక్రా స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఇక్రా స్కూల్ కరెస్పాండెంట్ నాసిర్ ప్రశంసించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ముందుండాలని అన్నారు. కరాటే వల్ల మానసికంగా శారీరకంగా ధృఢంగా ఉంటారన్నారు. శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ అక్బర్ అలీని, విద్యార్థులను కరస్పాండెంట్ నాసిర్ అభినందించారు.



ప్రశంసాపత్రాలు, ట్రోఫీలతో విద్యార్థులు

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి- హిందూపురం

రాష్ట్రంలో సంక్షేమ పథకాల సృష్టికర్తకు ప్రజలందరు అండగా ఉండాలని వైసిపి నియోజక వర్గ ఇన్‌చార్జ్ దీపిక అన్నారు. బుధవారం పురపాలక సంఘంలోని 17వ వార్డు కోట ప్రాంతంలో, రూరల్ మండలం బీరేపల్లి గ్రామంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో దీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మహేంద్ర నాథ్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ శివశంకర్ రెడ్డి, ఎ బ్లాక్ కన్వీనర్ సిపిసి సాధిక్, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి దీపిక

టిడిపి హయాంలోనే పంచాయతీల అభివృద్ధి : బికె



సమావేశంలో మాట్లాడుతున్న బికె. పార్థసారథి

ప్రజాశక్తి -పెనుకొండ

తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాయని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచుల సమర శంఖారావం కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ సర్పంచుల నిధులను కూడా వైసిపి కాజేస్తోందన్నారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు సహించలేక 20 మంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం స్పందించిన పాపాన పోలేదని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో గ్రామపంచాయతీలో తిరోగమనంలో పడ్డాయన్నారు. పట్టణాలతో సమానంగా పల్లెలను కూడా అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి ఉందన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి గ్రామాలను నిలువ దోపిడీ చేస్తున్న నియంత పాలనకు చరమగీతం పాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ సర్పంచుల సంఘం అధ్యక్షులు భూషణ్, ప్రస్తుత సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.